# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు     జాతీయ తెలుగు దినపత్రిక


**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387



PUBLISHED: TELANGANA   సంపుటి : 01   సంచిక : 137 శనివారం, ఏప్రిల్ 25, 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 08   వెల :05/-


### తొలి దశ పోలింగ్‌తోనే మమత జంగిల్ రాజ్‌కు ముగింపు..

## బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోదీ

**పశ్చిమ బెంగాల్:**పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని దుమ్ దుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు."తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం.



బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదు" అని వ్యాఖ్యానించారు.

### దిల్లీపై దండెత్తుతా !

## బీజేపీని తరిమికొడతా

### : మాస్ వార్నింగ్



**పశ్చిమ బెంగాల్:**"నన్ను ఓడించే సత్తా మీకు లేదు.. బెంగాల్ గడ్డపై మరోసారి జెండా ఎగురవేస్తా. ఇక్కడితో ఆగను, నేరుగా ఢిల్లీ కోటపై దండెత్తుతా!" – ఇవి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రత్యర్థులకు పంపిన బహిరంగ హెచ్చరికలు. ఏప్రిల్ 24, గురువారం చౌరింగీలో జరిగిన భారీ బహిరంగ సభలో దీదీ ప్రసంగం ఆద్యంతం నిప్పులు చెరిగినట్లు సాగింది.బీజేపీ కోసం లోపాయికారీగా పనిచేస్తున్న అధికారులపై, ఆ పార్టీ కార్యకర్తలపై మమత ఘాటు వ్యాఖ్యలు చేశారు. "బీజేపీకి బ్రోకర్లుగా వ్యవహరిస్తున్న 'ఆ టూ ' వరకు అందరి పేర్లు, చిరునామాలు నా డైరీలో నోట్ చేసుకున్నాను. మీ బ్యాక్‌గ్రౌండ్ చూసి అధికారులుగా నియమించుకున్నంత మాత్రాన మమ్మల్ని ఏమీ చేయలేరు. మీరు మమ్మల్ని గమనిస్తున్నారని అనుకుంటున్నారా? మీ ప్రతి కదలికను నేను కనిపెడుతూనే ఉన్నాను" అంటూ అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.పవర్ వద్దు.. బీజేపీ పతనం కావాలి!తనకు వ్యక్తిగతంగా అధికారంపై ఆశ లేదని, కానీ బీజేపీని గద్దె దించడమే తన ఏకైక లక్ష్యమని మమత ప్రకటించారు. "బెంగాల్‌లో విజయం సాధించిన వెంటనే అన్ని ప్రతిపక్ష పార్టీలను ఏకం చేస్తాను. ఢిల్లీని వశం చేసుకుంటాను. నాకు కుర్చీ పతనం కావాలి.

### బీజేపీలో చేరిన రాఘవ్ చద్దా సహా ఆప్ రాజ్యసభ ఎంపీలు..

## కేజ్రీవాల్ ఏమన్నారంటే





**న్యూఢిల్లీ :**దేశ రాజకీయాల్లో శుక్రవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీలు ముగ్గురు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్.. ముగ్గురూ శుక్రవారం బీజేపీలో చేరారు. మొత్తం పది మంది రాజ్యసభ ఎంపీల్లో ఈ ముగ్గురితో కలిసి మొత్తం ఏడుగురు పార్టీని వీడారు. అంటే.. మూడింట రెండొంతలు. దీంతో వీరు బీజేపీలో విలీనమైనట్లే. మరో ముగ్గురు ఎంపీలు మాత్రమే ఇప్పుడు రాజ్యసభలో ఆప్‌తో ఉన్నారు. రాఘవ్ చద్దా సహా ఆప్ ఎంపీలు పార్టీని వీడటంపై ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ స్పందించారు. పంజాబ్ ప్రజలకు బీజేపీ మరోసారి వెన్నుపోటు పొడిచిందని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా వేదికగా కేజ్రీవాల్ ఈ ప్రకటన చేశారు. పార్టీ నుంచి నేతలు వెళ్లిపోయినప్పటికీ.. ఆప్ ఎప్పుడూ ఐక్యంగానే ఉంటుందని పంజాబ్ సీఎం భగవంత్ మన్ అన్నారు. ఆప్ మరో ఎంపీ సంజయ్ సింగ్ కూడా ఈ అంశంపై మాట్లాడారు. "రాఘవ్ చద్దాకు పార్టీ అన్నీ ఇచ్చింది. ఎంపీ, ఎమ్మెల్యేను చేసింది. సందీప్ పాఠక్‌ను పంజాబ్ ప్రజలు ప్రేమతో రాజ్యసభకు పంపారు. దిగువస్థాయి నుంచి వచ్చిన రాజేంద్ర గుప్తా, అశోక్ మిట్టల్, స్వాతి మాలివాల్, విక్రమ్ సాహ్నీలకు పంజాబ్ ప్రజలు, పార్టీ ఉన్నత అవకాశాలు కల్పించింది. ప్రజల ఆశీస్సుల వల్లే హర్భజన్ సింగ్‌కు రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం దక్కింది.

## మంత్రులకు జీతాలు కట్, రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్త

**హైదరాబాద్ :** ఆర్థిక కష్టాల్లో ఉన్న రాష్ట్రానికి ఊపిరి పోయడానికి, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అసాధారణ నిర్ణయం తీసుకుంది. మంత్రులందరూ తమ జీతాల్లో సగం వాటాను వదులుకోవాలని నిర్ణయించుకోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హిమాచల్ ప్రదేశ్ సర్కార్ బాటలో సాగుతూ, ప్రజాప్రతినిధుల త్యాగంతోనైనా పెన్షనర్ల కన్నీళ్లు తుడవాలన్నది ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో సుమారు రూ.8,000 కోట్ల రిటైర్మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, వీటిని క్లియర్ చేయడానికి ఒక 'వనరుల సమీకరణ ఉపసంఘాన్ని' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. "రాష్ట్ర ఏర్పాటు సమయంలో లేని ఈ బకాయిలు గత పదేళ్లలో కొండలా





పెరిగాయి. పదవీ విరమణ చేసిన వృద్ధులు తమ సొంత డబ్బు కోసం ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. అందుకే 100 రోజుల్లో ఈ బకాయిలను క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. మంత్రులే కాకుండా, అవసరమైతే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జీతాల్లోనూ 50 శాతం కోత విధించనున్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై సీబీఐ విచారణను వేగవంతం చేయాలని క్యాబినెట్ తీర్మానించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకి కాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఇప్పటికే ఆదేశాలు ఇచ్చి తొమ్మిది నెలలైనా విచారణ ప్రారంభం కాకపోవడంపై క్యాబినెట్ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనిపై కేంద్రానికి, సీబీఐకి మరోసారి లేఖ రాయాలని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో పునరాభివృద్ధి చేయడానికి పీపీపీ నమూనాలో ఆమోదం లభించింది. మంథని నియోజకవర్గంలో 45,000 ఎకరాలకు సాగునీరు అందించే 'చిన్న కాళేశ్వరం' ప్రాజెక్టు పెండింగ్ పనులకు మోక్షం లభించింది. భూసేకరణ కోసం రూ.166.67 కోట్లను క్యాబినెట్ మంజూరు చేసింది.

## బెంగాల్ లో తొలి విడత పోలింగ్ లో బీజేపీకి దక్కే సీట్లెన్ని, ఇదీ లెక్క..



**పశ్చిమ బెంగాల్:**పశ్చిమ బెంగాల్ లో భారీగా ఓటెత్తారు. రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. పెరిగిన ఓటింగ్ శాతం తో కొత్త అంచనాలు తెర మీదకు వచ్చాయి. బీజేపీ ఈ పోలింగ్ తమకే అనుకూలమని .. తమదే అధికారమని చెబుతున్నారు. కాగా, మమతా ఓటర్లు మరోసారి తమకే పట్టం కట్టారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత పోలింగ్ రాష్ట్రంలో అధికారం ఎవరిదో డిసైడ్ చేయనుంది. ఈ సమయం లో తొలి విడతలో బీజేపీకి దక్కే సీట్ల పైన ఆ పార్టీ ముఖ్య నేతలు కీలక అంచనాలు వెల్లడించారు.బెంగాల్ తొలి విడత ఎన్నికల పైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. తమ పార్టీకి వచ్చే సీట్ల పైన ఆసక్తి కర లెక్కలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే నని చెప్పుకొచ్చారు. మట్నదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మట్నదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు.బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. ఇదే సమయం లో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడి కానుంది.

## నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్ :** ఇటీవల మరణించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు చిత్రపటానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని నాదెండ్ల నివాసానికి వెళ్లి ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చరు. ఈ సందర్భంగా తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ రాజు శంభీపూర్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు నాదెండ్ల చిత్రపటానికి ఉన్నారు.

### ట్రంప్ చెంప చెల్లుమనేలా కౌంటర్.. "నరకం"

### వ్యాఖ్యల్లో భారత్‌కి ఇరాన్ సపోర్ట్



**అమెరికా:**అమెరికా అధ్యక్షుడు ఐశీఋశ్రీంతీబఎజూ రీసెంట్ గా చేసిన ఒక సోషల్ మీడియా రీపోస్ట్ అంతర్జాతీయ స్థాయిలో వివాదానికి దారి తీసింది. అమెరికన్ రేడియో హోస్ట్ భారత్‌ను "నరకంతో సమానం"గా పోలుస్తూ రాసిన లేఖను ట్రంప్ షేర్ చేయడంతో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలను రేకెత్తించాయి.ఈ వ్యాఖ్యలపై భారత్‌లోని జుఎమ్ఱంంఎ గట్టిగా స్పందించింది. ముఖ్యంగా ముంబయిలోని ఇరాన్ ఎంబసీ, భారత్ గురించి సరైన అవగాహన లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని పేర్కొంది. భారత్‌లోని అభివృద్ధి, సాంస్కృతిక వైభవం, ఆధునిక మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా చూసిన తర్వాతే అభిప్రాయం వ్యక్తం చేయాలని సూచించింది. ట్రంప్ భారత్ పర్యటనకు వస్తే నిజ పరిస్థితులు అర్థమవుతాయని పేర్కొంది.ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ఆధునిక నగర అభివృద్ధి, సంప్రదాయ వేడుకలు, పర్యాటక ప్రదేశాలను చూపించే వీడియోను ఎంబసీ షేర్ చేసింది. భారత్ అనేది పురాతన నాగరికతతో పాటు ఆధునిక పురోగతిని కలగలిపిన దేశమని స్పష్టం చేసింది.ఇప్పటికే హైదరాబాద్‌లోని ఇరాన్ ఎంబసీ కూడా ఇదే అంశంపై స్పందిస్తూ, భారత్, చైనా వంటి దేశాలు గొప్ప నాగరికతలకు పుట్టినిల్లని పేర్కొంది. ప్రపంచ చరిత్రలో కీలక పాత్ర పోషించిన దేశాలను అవమానించడం తగదని విమర్శించింది.

### సంస్కరణల సారథికి సమున్నత గౌరవం,

## 'బిజినెస్ రిఫార్మర్' గా చంద్రబాబు

**అమరావతి :**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనా దక్షతకు మరో మకుటం దక్కింది. ప్రతిష్ఠాత్మక మీడియా సంస్థ ఎకనమిక్ టైమ్స్ ప్రకటించిన 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. రేపు (శనివారం) ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే భారీ కార్యక్రమంలో చంద్రబాబు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మాత్రమే కాదు, అంతకు మించి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్', 'స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్' అనే కొత్త నినాదాలతో చంద్రబాబు పాలనలో దూసుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే దాదాపు రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు ఆయన చేస్తున్న కృషిని ఎకనమిక్ టైమ్స్ జ్యూరీ ప్రత్యేకంగా ప్రశంసించింది.దిగ్గజాల సమక్షంలో పురస్కారంరేపు సాయంత్రం





5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు జరిగే ఈ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా దేశంలోని దిగ్గజ పారిశ్రామికవేత్తలు పాల్గొననున్నారు. గతంలో ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అరుణ్ జైట్లీ, పీయూష్ గోయల్, నితీష్ కుమార్, అశ్వినీ వైష్ణవ్, ఎస్. జైశంకర్ వంటి ప్రముఖులు అందుకున్నారు. ఇప్పుడు ఆ జాబితాలో చంద్రబాబు చేరడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది.

మధ్యాహ్నం 12:50: అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి నిష్క్రమణ.మధ్యాహ్నం 2:40: ముంబై విమానాశ్రయానికి చేరుకుంటారు.సాయంత్రం 5:25: జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు.

ఒకప్పుడు హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చి ప్రపంచ పటంలో నిలిపిన చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని ఆర్థిక కేంద్రంగా, విశాఖను పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతున్నారు. పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను సరళతరం చేస్తూ ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ అవార్డు ఆయన బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచడ

## శ్రీ రాం పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు




**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 24**
కొడకండ్ల మండలం నర్సింగాపురం గ్రామానికి చెందిన నూనెముంతల సోమన్న--జయ దంపతుల కుమారుడు శ్రీ రాం పుట్టినరోజు సందర్భంగా ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురం గ్రామంలోని వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది వృద్ధులకు అన్నదానం చేసి, 5 లీటర్ల పెరుగు డబ్బాను పంపిణీ చేశారు. వేసవి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆశ్రమానికి రెండు ఫ్యాన్లు అందజేశారు. కె.ఎన్.ఆర్ వెల్డింగ్ షాప్ ప్రొప్రైటర్ కొమ్ముకూరు ప్రవీణ్ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, సోమన్న--జయ దంపతుల సేవాభావాన్ని అభినందించారు. దాతలు హాజరు కాలేకపోవడంతో, వారి తరఫున ప్రసన్న కుమార్ కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు శ్రీ రాం కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.

## స్టేషన్ ఘనపూర్ లో ఇన్‌పుట్ డీలర్లపై ఆకస్మిక దాడులు




**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఏప్రిల్ 24**
జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాల మేరకు మండలంలోని వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్ల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. మండల రెవెన్యూ అధికారి స్వప్న, మండల వ్యవసాయ అధికారి చంద్రన్ కుమార్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు, లైసెన్సులు, విక్రయ రికార్డులను అధికారులు సవివరంగా పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్లు అందేలా ప్రభుత్వం విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డీలర్లకు స్పష్టం చేశారు. దుకాణం వద్ద లైసెన్సులను ప్రదర్శించడం, స్టాక్ బోర్డును నిరంతరం నవీకరించడం, స్టాక్ రిజిస్టర్లను ప్రతిరోజూ నమోదు చేయడం, ఈ-పోస్ వివరాలకు భౌతిక నిల్వ సరిపోల్చడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విక్రయానికి బిల్లు ఇవ్వాలని, ఎమ్ఆర్‌పీ ధరలకే ఉత్పత్తులను విక్రయించాలని ఆదేశించారు. గడువు ముగిసిన లేదా నాసిరకం ఉత్పత్తులను విక్రయిస్తే, రైతులను మోసం చేసే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు సమయానికి నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందించేందుకు ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## వడ్లకొండ, కల్లెడలో మృతుల కుటుంబాలను ఓదార్చిన ఆరూరి రమేష్



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24**
వరంగల్ జిల్లా:వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ శుక్రవారం పర్వతగిరి మండలంలో పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. వడ్లకొండ గ్రామ మాజీ ఉప సర్పంచ్ పంతంగి ఉప్పలయ్య ఇటీవల మరణించగా, ఆయన నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కల్లెడ గ్రామానికి వెళ్లి ఆదొండ మల్లేశం తండ్రి రాములు ఇటీవల మరణించడంతో వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం ఏకాంతం గౌడ్, మాజీ పర్వతగిరి పీఏసీఎస్ చైర్మన్ మనోజ్ కుమార్, వడ్లకొండ మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు యాదవ్, వల్లందాసు వెంకన్న, బీఆర్ఎస్ గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు ఆదోండ వెంకటయ్య, ఆదొండ సాయిలు, సోమవారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, గోరుగుట్ట తండా మాజీ సర్పంచ్ బానోతు వెంకన్న, బొట్ల భాస్కర్, చిన్నపాక శ్రీకాంత్, విజయ్, రాజు పాల్గొన్నారు.

## శంకర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించకుండా అడ్డుకున్న పోలీసులు: మాజీ మంత్రి ఎర్రబెల్లి, మాజీ ఎమ్మెల్యే ఆరూరి గృహ నిర్బంధం

**- ఆర్టీసీ డ్రైవర్ మృతి ప్రభుత్వ హత్యనే: పరామర్శకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులపై ఎర్రబెల్లి ఫైర్**



**తెలుగు గళం న్యూస్ హనుమకొండ/ఏప్రిల్ 24**
హనుమకొండ జిల్లా:ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి ప్రభుత్వ హత్యనే అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపించారు. మృతుడికి నివాళులర్పించేందుకు వెళ్తున్న తనను, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేయడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. హన్మకొండ రాంనగర్‌లోని తన నివాసం నుండి శంకర్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు బయలుదేరుతుండగా ముందస్తు అరెస్టులో భాగంగా ఏసీపీ నరహరిరావు, సీఐలు రంజిత్, రవికుమార్, సుధాకర్ రెడ్డి, ఎస్ఐ మహేందర్ రెడ్డి ఇంటికి వచ్చి అడ్డుకున్నారని ఎర్రబెల్లి తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ "ఆర్టీసీ కార్మికులను నమ్మించి కాంగ్రెస్ సర్కార్ దగా చేసింది. శంకర్ గౌడ్ కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. "నర్సంపేటలో నిప్పంటించుకొని శంకర్ గౌడ్ మృతి చెందాడు. మరో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇవి ముమ్మాటికీ రేవంత్ సర్కార్ హత్యలే. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇంకెంత కాలం గడుపుతారు? ఇంకెంత మందిని బలి తీసుకుంటారు రేవంత్ రెడ్డి?" అని ప్రశ్నించారు. అధికార పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, ఆర్టీసీ కార్మి కులకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని తెలిపారు. ప్రజలే తరిమి కొట్టేదా కా చూసుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ చింతల యాదగిరి, మాజీ జడ్పీటీసీ మార్గం బిక్షపతి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టపురం యాకాంతం గౌడ్, పర్వతగిరి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, జాక్కు రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## సత్తుపల్లి లో 3 వ రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె

- ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ మృతికి సంఘీభావం గా మౌన ప్రదర్శన
- ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్
- మద్దతుగా పాల్గొన్న పలు రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు
- వేసవి వేడికి స్పృహ తప్పి పడిపోయిన మహిళా కండక్టర్ వెంటనే ప్రాథమిక చికిత్సకు తరలింపు"



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్24(తెలుగుగళం) న్యూస్:**
సత్తుపల్లి ఆర్టీసీ జెఏసి ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె కార్యాచరణలో భాగంగాశుక్రవారం రోజు సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ అమరవీరుడు నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ప్రాణ త్యాగాన్ని స్మరించుకుంటూ మౌనం పాటించారు ఆర్టీసీ కార్మికులు. అనంతరం డ్రైవర్ శంకర్ గౌడ్ కు సంఘీభావం గా సత్తుపల్లి ఆర్టీసీ డిపో సిబ్బంది తో సత్తుపల్లి పట్టణంలో బస్టాండ్ సెంటర్ నుండి పాత సెంటర్ వరకు మౌనంగా రోడ్ ప్రదర్శన (ర్యాలీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ ఎస్. సిపియం,సిపిఐ అనుబంధ పార్టీ లు, బీజేపీ, జనసేన మరియు టీడీపీ పార్టీ పార్టీనిధులు డిపోలో సమ్మె కి మద్దతుగా వచ్చి సంఘీభావం తెలపడం జరిగింది. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు సత్తుపల్లి ఆర్టీసీ డిపో జెఏసి ని కలిసి సమ్మె కి మద్దతు ఇస్తూ సమ్మె గురించి కార్మికుల హక్కుల గురించి మాట్లాడటం జరిగింది.

**ఎండకు తాళలేక సొమ్మసిల్లి పడిపోయిన మహిళా కండక్టర్**
ఆర్టీసీ అమరవీరుడు శంకర్ గౌడ్ మృతికి సత్తుపల్లి పట్టణంలో ఆర్టీసీ కార్మికులు మౌన ప్రదర్శన చేపట్టడం జరిగింది ఐతే ఎం జానకి అనే మహిళా కండక్టర్ ఎండకు తాళలేక స్పృహ తప్పి పడిపోవడంతో వెంటనే అప్రమత్తమైన ఆర్టీసీ కార్మికులు ఆమెకు ప్రాథమిక చికిత్స కోసం తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జి. మల్లికార్జున్, బి. రాంబాబు, కె. ఎస్. రావు, జి. సతీష్, పి. రాఘవులు, యాప్. దొరబాబు, డి. కృష్ణ, డిఎంకె. రావు, యం. ముత్తయ్య, యంయన్. భూషణం, యం. జానకి, యాప్. యన్‌కుమార్, యస్. యస్ రావు, యాప్. ఆర్ పి. రావు, డి. యాదగిరి, టిఎస్. రావు,సిపియం,బిఆర్ ఎస్, టిటిడిపి సిపిఐ జనసేన బిజెపి నాయకులు,పలు స్వచ్ఛందసంస్థలు,ఉద్యోగసంఘాలు,తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, డివిజన్ కమిటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సత్తుపల్లి అధ్యక్షుడు వైకుంఠరావు, శర్మ, రమేష్ ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి: సిపిఎం"



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రిల్ 24(తెలుగుగళం)న్యూస్:**
రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై 15 రోజులు గడిచినా మిల్లుల కేటాయింపులో ఆలస్యం జరుగుతుందని విమర్శించారు. దాదాపు 20 రోజులుగా కేంద్రాల వద్ద ధాన్యం నిల్వ ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎం.ఎస్.పి ప్రకారం వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## బస్తాలు లేవు, లారీలు రావు

**- మక్కల కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఇక్కట్లు, తక్షణ చర్యలు తీసుకోవాలని గడ్డం రఘువంశీ డిమాండ్**



**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/ఏప్రిల్ 24**
హనుమకొండ జిల్లా:ఐనవోలు మండల కేంద్రంలో మక్కల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గత 15 రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గన్నీ బస్తాలు సరిపడా ఇవ్వకపోవడం, లారీలు సకాలంలో రాకపోవడం, బయోమెట్రిక్ కోసం గంటల తరబడి బారులు తీరడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై ఐనవోలు మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్ తీవ్రంగా స్పందించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన మక్కల కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని, వెంటనే సమస్యను,పరిష్కరించాలని ఆయన కోరారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత:హెల్మెట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా 'ఎలైవ్-ఎరైవ్' కార్యక్రమం**
**- వాహనదారులు ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి: ఎస్పీ సంకీర్త్**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి చిట్యాల**
రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. శుక్రవారం చిట్యాల మండలం గుంటూరుపల్లి గ్రామంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎలైవ్-ఎరైవ్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ తో కలిసి ఎమ్మెల్యే ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం జరగకుండా ఉండాలంటే హెల్మెట్ ధరించడం ఏకైక మార్గమని స్పష్టం చేశారు. "ప్రాణం చాలా విలువైంది, మీ కుటుంబం మీ కోసం ఇంటి వద్ద ఎదురుచూస్తుందని గుర్తుంచుకోవాలి" అని వాహనదారులకు హితవు పలికారు. పోలీస్ శాఖ కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, ప్రజల భద్రతను కాంక్షిస్తూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను స్వచ్ఛందంగా పాటించి సురక్షిత ప్రయాణాన్ని సాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారిలో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్లే తలలకు తీవ్ర గాయాలై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు హెల్మెట్‌ను భారంలా కాకుండా ఒక రక్షణ కవచంలా భావించాలని సూచించారు. గ్రామస్థాయి నుండి రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్,ఎస్సైలు సతీష్,అమూల్య,పోలీస్ అధికారులు, స్థానిక గ్రామ సర్పంచ్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు,వివిధ మండలాల నాయకులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరం విజయవంతం"





**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్24(తెలుగుగళం)న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలం వి ఎం బంజర్ లో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారు రాజసాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని జన్నారెడ్డి విజయ జ్ఞాపకార్థం నిర్వహించారు.శిబిరంలో 150 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేయగా, 138 మందిని కాకినాడకు తరలించారు. వీరిలో 68 మందికి ఆపరేషన్లు నిర్వహించి తిరిగి చేర్చగా, మరో 70 మందిని కూడా చికిత్సకు పంపించి సురక్షితంగా తీసుకొచ్చారు. కొంతమందికి ఆరోగ్య సమస్యల కారణంగా ఆపరేషన్లు వాయిదా పడ్డాయి.ఆపరేషన్ చేయించు కున్న వారికి మే 26న రాజా సాయి మందిరంలో పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోడులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిబిరానికి సహకరించిన వైద్యులు, సిబ్బందికి నిర్వాహకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# వడ్లకొండలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

**- గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది - సర్పంచ్ డెక్క సునీత**



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24** వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక గ్రామసభ,నిర్వహించారు.గ్రామసభలో వడ్లకొండ గ్రామ సర్పంచ్ డెక్క సునీత–కుమారస్వామి మాట్లాడుతూ దేశంలో గ్రామాలు అభివృద్ధి చెందితేనే ప్రపంచంలో మన దేశం అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. గ్రామంలోని ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభ ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రామ ప్రజలు తమ సమస్యలను నేరుగా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకే ప్రభుత్వాలు పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించాయని గుర్తు చేశారు. గ్రామసభలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కోసం గ్రామ ప్రజలందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్,జీపీఓ వెంకటయ్య,విద్యుత్ లైన్‌మెన్,ఫీల్డ్ అసిస్టెంట్,వార్డు సభ్యులు, ఏఎన్ఎం,ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు,రేషన్ డీలర్, గ్రామపంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లల భద్రత ముఖ్యం

**- ఎండ తీవ్రత, ప్రమాదాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి -ఎస్ఐ ప్రవీణ్**

**- సెలవుల్లో మొబైల్‌కు కళ్లెం వేయండి: సృజనాత్మక కార్యక్రమాల వైపు పిల్లలను మళ్లించాలని ఎస్ఐ సూచన**



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24**
తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పర్వతగిరి ఎస్ఐ బి. ప్రవీణ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా ఏప్రిల్ చివరి వారంలో ప్రారంభమయ్యే ఈ సెలవులు మే నెలంతా కొనసాగుతాయని, ఈ సమయంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దీంతో పిల్లలు హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.సెలవుల్లో పిల్లలు ఎక్కువగా బయట ఆడుకోవడం, నీటి వనరుల దగ్గరికి వెళ్లడం, రోడ్లపై నిర్లక్ష్యంగా తిరగడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా బావులు, చెరువులు, కాలువల వద్ద పిల్లలను ఒంటరిగా వదలకూడదని, సైకిల్ లేదా ఇతర వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని కోరారు.

ఎండల నుండి రక్షణకు సూచనలు:

మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలను బయటకు పంపకండి.

**– తరచూ నీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీరు తాగించాలి.**

**– బయటకు వెళ్లేటప్పుడు తలపై టోపీ లేదా గుడ్డ కప్పుకోవాలి.**

**– ఎండలో ఎక్కువసేపు ఆడకుండా చూడాలి. మొబైల్ ఫోన్ వినియోగంపై నియంత్రణ:**

సెలవుల్లో పిల్లలు మొబైల్, వీడియో గేమ్స్, సోషల్ మీడియాకు అలవాటు పడే ప్రమాదం ఉందని, ఇది కంటి సమస్యలు, నిద్రలేమి, చదువుపై ఆసక్తి తగ్గడానికి కారణమవుతుందని హెచ్చరించారు. రోజుకు పరిమిత సమయం మాత్రమే మొబైల్ వినియోగానికి అనుమతించాలన్నారు.

ప్రమాదాల నివారణకు సూచనలు:

–చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపకండి.

–నీటి వనరుల దగ్గర పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.

–గ్యాస్ స్టవ్, విద్యుత్ పరికరాల దగ్గర పిల్లలను ఒంటరిగా వదలకండి.

–అపరిచితులతో మాట్లాడవద్దని పిల్లలకు చెప్పండి.

వేసవి సెలవులను పుస్తకాలు చదవడం, క్రీడలు, డ్రాయింగ్, సంగీతం వంటి సృజనాత్మక కార్యక్రమాలకు ఉపయోగించుకోవాలని, కుటుంబంతో సమయం గడపడం వల్ల పిల్లల్లో మంచి విలువలు పెరుగుతాయని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చని, పిల్లల ఆరోగ్యం, భద్రత కోసం ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

# ఆటో బైక్ ఢీ ఒకరికి గాయాలు

**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని చిల్లంచర్ల గ్రామపంచాయతీకి చెందిన దూడపాక వెంకటేష్ మరిపెడ మండల కేంద్రానికి మే ఒకటీ వ తారీఖున పెళ్లి ఉన్నందున తన పెళ్లి కార్రెట్ల కోసం వెళ్తున్న క్రమంలో ఆటో ఢీకొనగా బైక్పై వెళ్తున్న వెంకటేష్ కు తీవ్ర గాయాలు అయి తలకు, కాలుకు తీవ్రమైన దెబ్బలు తగలడంతో స్థానికులు 108 వాహనంకి సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది ఈఎంటి అనుముల రామన్న క్షతగాత్రున్ని ప్రథమ చికిత్స చేసి మానుకోట జిల్లా ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో 108 ఈఎంటి అనుముల రామన్న, పైలట్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం:గండ్ర జ్యోతి

**- డిమాండ్ల సాధన కోసం ప్రాణత్యాగాలు చేస్తున్నా పాలకుల్లో చలనం లేదు**

**- ఆర్టీసీ సమ్మెకు సంఘీభావం తెలిపిన వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్**

**- మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే చర్చలు జరపాలని డిమాండ్**




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం ప్రాణత్యాగాలు చేస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సిగ్గుచేటని వరంగల్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ధ్వజమెత్తారు.భూపాలపల్లి ఆర్టీసీ డిపో ముందు గత మూడు రోజులుగా కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆమె శుక్రవారం సంపూర్ణ మద్దతు ప్రకటించి, ధర్నాలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు 50 వేల మంది కార్మికుల జీవితాలను రోడ్డు పాలు చేస్తోందని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కార్మికుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించిన గండ్ర జ్యోతి, ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీని విలీనం చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు కాలయాపన చేయడం కార్మికులను వంచించడమేనని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ శాసనసభలో తీర్మానం చేసి గెజిట్ విడుదల చేశారని, ఆ ప్రక్రియను పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లే శంకర్ గౌడ్ లాంటి కార్మికులు ఆత్మబలిదానాలకు పాల్పడుతున్నారని, భద్రాచలం, నల్గొండ, భూపాలపల్లి డిపోల్లో ఆత్మహత్యాయత్నాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుపై విమర్శలు గుప్పిస్తూ.. కార్మికులు సమ్మె చేస్తున్నా కనీసం వారి వద్దకు వచ్చి ధైర్యం చెప్పలేని స్థితిలో ఆయన ఉన్నారని, ఇది ఆయన అసమర్థతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. భూపాలపల్లికి ఆర్టీసీ డిపోను తీసుకువచ్చింది మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి అని గుర్తు చేస్తూ, ప్రస్తుత ఎమ్మెల్యే జిల్లా అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేశారని విమర్శిం చారు.సంబంధిత శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే ఆర్టీసీ నాయకులను చర్చలకు పిలిచి, వారి 30 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారో కోలు ఉధృతం చేసి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,భారీ సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు,కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బలిదానాలు పరిష్కారం కాదు, చర్చలే మార్గం:ఆర్టీసీ కార్మికులతో తక్షణమే చర్చలు జరపాలి-ఆర్ఎస్పీ డిమాండ్

**- శంకర్ గౌడ్ మరణానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి**




**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24**
వరంగల్ జిల్లా:రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో తక్షణమే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యులు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు.పర్వతగిరిలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ సమ్మె బలిదానాలకు పరిష్కారం కాదని, సమస్యల పరిష్కారం కోసం పోరాటం ద్వారా ప్రభుత్వం మెడలు వంచి చర్చలతోనే కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవాలని, ఆర్టీసీ కార్మికులు ఎవరూ ఆత్మబలిదానాలు చేసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో ఆర్టీసీ సమ్మె ప్రస్తుతం విషాదఛాయల్లో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆత్మబలిదానం చేసుకోవడం బాధాకరమన్నారు. న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కిన సామాన్య కార్మికుడు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో మనస్తాపం చెంది ఒంటిపై పెట్రోల్ పోసుకుని ప్రాణాలు తీసుకోవడం ఆ కుటుంబానికి తీరని లోటు అని తెలిపారు.కార్మిక లోకం తమ పోరాటాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం పోరాటం చేయడం భారత రాజ్యాంగబద్ధమైన హక్కు అని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మరణించాడని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వల్లందాస్ డిమాండ్ చేశారు.

# మృతుల కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ భరోసా

**- వడ్లకొండ,పర్వతగిరిలో పరామర్శించి ఆర్థిక సాయం అందించిన మేడిశెట్టి రాములు**





**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24**
వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో పలువురు మృతుల కుటుంబాలను మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వడ్లకొండ గ్రామ మాజీ ఉపసర్పంచ్, విశ్రాంత అటెండర్ పంతంగి ఉప్పలయ్య గుండెపోటుతో మృతి చెందగా, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం పర్వతగిరి మండల కేంద్రంలో ఇటీవల మరణించిన యాసారపు యాకయ్య దశదిన కర్మకు హాజరై కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి కూడా ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్, చిన నర్సయ్య, గంగాధర్ రావు, గోనె సంపత్, సందెల నవీన్, సురేందర్ రావు, సింగారపు రమేష్, జిల్లా ధర్మయ్య, కంతెం ఏకాంతం, అర్షం దర్గస్వామి, బొట్ల కిష్టయ్య, మహ్మద్ సర్వర్, కొండా వెంకన్న, ఆదొండ బిక్షపతి, బొట్ల వెంకన్న, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రిడిటేయేషన్ కార్డుల మంజూరు,

- సమాజానికి ఉపయోగపడే వార్తలు అందించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి,
- అక్రిడిటేయేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్/జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్,





**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**
జిల్లాలో 2026–2028 సంవత్సరానికి సంబందిచిన మీడియా అక్రిడిటేయేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ స్నేహ శబరీష్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్‌ఓను అడిగి తెలుసుకున్నారు.ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు.జిల్లాలో ఇప్పటివరకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ద్వారా (447) ఆన్లైన్ దరఖాస్తులు వచ్చాయని, అట్టి దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డు అందించాలని, ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,డీపీఆర్‌ఓ పి. రాజేంద్ర ప్రసాద్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు సి.హెచ్ శ్రీనివాస్,ఈరగాని బిక్షం, వేముల అయోధ్య రామయ్య, నవాబ్,షేక్ అక్రం, ఎం.మోహన్ రెడ్డి, గాడిపెల్లి శ్రీహరి, ఉమ్మగాని మధు, ఉప్పల రంగ, సిబ్బంది రాము తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వ హత్యే:బీఆర్ఎస్ నేతల నిరసన

- శంకర్ గౌడ్ పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,మాజీ ఎమ్మెల్యే గండ్ర
- మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి ధర్నా
- కార్మికుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది:నేతల ఆగ్రహం







**తెలుగు గళం న్యూస్ నర్సంపేట**
ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రాణత్యాగం చేసిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శుక్రవారం శంకర్ గౌడ్ పార్థివ దేహానికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్,భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి,రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేయడం వల్లే, మనస్తాపం చెందిన శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకుని ఆత్మబలిదానానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణత్యాగంతోనైనా తోటి కార్మికులకు న్యాయం జరుగుతుందన్న శంకర్ గౌడ్ ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. శంకర్ గౌడ్ మరణానికి ముమ్మాటికీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి సత్వరమే ప్రభుత్వం భారీ ఆర్థిక సహాయం ప్రకటించాలని, అలాగే కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తూ నేతలు ఆర్టీసీ కార్మికులతో కలిసి రోడ్డుపై బైఠాయించి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్మికులకు అండగా నిలుస్తుందని, హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు,భారీ సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు,జేఏసీ నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు.

# ఆర్టీసీ కార్మికుల చావులకు ప్రభుత్వ మొండివైఖరే కారణం:తెలంగాణ రాజ్యాధికార పార్టీ ధ్వజం

- నర్సంపేట కార్మికుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానంపై జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసన
- మృతుని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా,ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్
- కార్మికుల 30 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రవి పటేల్ హెచ్చరిక







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈరోజు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె మూడవ రోజుకు చేరుకున్న నేపథ్యంలో,నర్సంపేటలో శంకర్ గౌడ్ అనే కార్మికుడు ప్రభుత్వం కనీసం చర్చలకు పిలవకపోవడంపై మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు.శంకర్ గౌడ్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆయన తీవ్రంగా విమర్శించారు.నిరసన ర్యాలీ అనంతరం జరిగిన సభలో రవి పటేల్ మాట్లాడుతూ.. “తెలంగాణ సమాజం గర్వించేలా సేవలందించే ఆర్టీసీ కార్మికులను రోడ్డున పడేయడం ప్రభుత్వానికి తగదు. కేవలం నర్సంపేటలోనే కాకుండా నల్గొండ, భూపాలపల్లి జిల్లాల్లో కూడా పలువురు కార్మికులు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులలో చలనం లేకపోవడం దుర్మార్గం” అని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే తన వైఖరిని మార్చుకుని, కార్మికులతో చర్చల ప్రక్రియను ప్రారంభించి వారి న్యాయమైన 30 డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మరణించిన కార్మికుడు శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఒక కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అలాగే ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు అడుగుతున్నవి అన్యాయమైన కోర్కెలు కావని, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ స్వయంగా ఇచ్చిన హామీలనే అమలు చేయాలని వారు కోరుతున్నారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట తప్పడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఆయన ధ్వజమెత్తారు.తీన్మార్ మల్లన్న నేతృత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ బాధితుల పక్షాన ఉంటుందని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. “కార్మికులు లేనిదే ఏ ప్రభుత్వం నిలబడదు, వారి ప్రాణాలతో చెలగాటం ఆడితే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించి ప్రభుత్వాన్ని గద్దె దించుతాం” అని హెచ్చరించారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుగాల ప్రణయ్ రాజ్, జిల్లా కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు అనంతుల సంపత్ బొట్టు, జిల్లా కోశాధికారి జినూకల శ్రీను, జిల్లా మహిళా అధ్యక్షురాలు సామల శ్రీలత, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు గండు కరుణాకర్, జిల్లా నాయకులు రాజేందర్, లక్ష్మణ్,పార్టీ శ్రేణులు,ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## ప్రజా ప్రభుత్వంలో రైతులే రాజులు: కల్లెడ, చింతనెక్కొండలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

- పర్వతగిరి మండల రైతులకు 1.64 కోట్ల బోనస్: గత ప్రభుత్వంలా తాలు పేరుతో దోపిడీ లేదు- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24**
వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలోని కల్లెడ,మాల్యా తండా,మూడెత్తుల తండా, ఏనుగల్లు,చింతనెక్కొండ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, స్థానిక సర్పంచ్‌లు, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తోందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి రైతుకు అందేలా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు.జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు దేవేందర్ రావు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో రైతులను రాజులు చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే నాగరాజు నాయకత్వంలో కృషి చేస్తున్నామన్నారు.రైతులకు సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు, రైతు భరోసా లాంటి పథకాలతో అండగా నిలుస్తున్నామని చెప్పారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కేవలం పర్వతగిరి మండల రైతులకే 1.64 కోట్ల రూపాయల బోనస్ అందిందని, దేశంలో రైతులను ఆదుకునే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. గత ప్రభుత్వం తాలు పేరుతో క్వింటాకు ఐదారు కిలోలు దోచుకుని రైతులను మోసం చేసిందని, కానీ తమ ప్రభుత్వం రైతు పండించే ప్రతి గింజా కొనుగోలు చేసి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు తక్కలపల్లి శ్రీనివాస్, మంజుల శ్రీనివాస్, లక్పతి, తోర్రి పద్మ కుమార్ యాదవ్, గడుధుల రవి యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు యాకుబ్ నాయక్, రతన్ రావు, చలపతిరావు,భిక్షపతి, జిల్లా కుమార్, ధోని సంపత్,వివిధ శాఖల అధికారులు,మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసుల సేవకు చల్లని చేయూత: వరంగల్‌లో ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు మజ్జిగ పంపిణీ

- ఎండ వేడిలో ఉపశమనం: ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ అందించిన భారతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు




**తెలుగు గళం న్యూస్ వరంగల్/ఏప్రిల్ 24** వరంగల్ జిల్లా:మండు వేసవిలో తీవ్ర ఎండను సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం రోడ్లపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చల్లని మజ్జిగ అందించి మానవత్వం చాటుకున్నారు.వరంగల్ కమిషనరేట్ పరిధిలో పలు కూడళ్లలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. భానుడి భగభగల నుంచి వారికి కాస్త ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రావణ్, సభ్యులు రామ శ్రీనివాస్, అల్లాడి సుమన్,నల్ల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్ట్ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.పోలీసుల సేవలను గుర్తించి ఇలా మజ్జిగ పంపిణీ చేసిన రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ కానిస్టేబుళ్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎండలో విధులు నిర్వహించే తమకు ఇది ఎంతో ఉపశమనం కలిగించిందని వారు పేర్కొన్నారు.

## ఇప్పగూడెంలో ఘనంగా కామ్రేడ్ మంతెన నారాయణరెడ్డి 32వ వర్ధంతి





**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఏప్రిల్ 24**
జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ మండలం, ఇప్పగూడెం గ్రామంలో అమరజీవి కామ్రేడ్ మంతెన నారాయణరెడ్డి 32వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన ఆయన సేవలను స్మరించుకున్నారు.అదేవిధంగా, గ్రామంలోని మంతెన నారాయణరెడ్డి మెమోరియల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణిత, వైద్య బృందం మరియు గ్రామ ప్రజలు కలిసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# పోగొట్టుకున్న మొబైల్ రికవరీ:బాధితుడికి అందజేసిన కొత్తపల్లి గోరి పోలీసులు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెలికితీయడంలో పోలీసులు విజయం సాధిస్తున్నారు.కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఒక స్మార్ట్‌ఫోన్‌ను పోలీసులు ట్రేస్ చేసి,బాధితుడికి అప్పగించారు.కొత్తపల్లి గోరి సబ్-ఇన్‌స్పెక్టర్ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామరంచపల్లి గ్రామానికి చెందిన జూపాక అనిల్ కుమార్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం ప్రయాణ మార్గమధ్యంలో తన విలువైన స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై బాధితుడు కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌లో మొబైల్ ఐఎంఈఐ నెంబర్ ఆధారంగా ఫోన్‌ను బ్లాక్ చేసి, ట్రేసింగ్‌లో పెట్టారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా ఫోన్ ఆచూకీని గుర్తించిన పోలీసులు, దానిని స్వాధీనం చేసుకుని శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు అనిల్ కుమార్‌కు అందజేశారు.పోగొట్టుకున్న తన ఫోన్‌ను తిరిగి అప్పగించినందుకు బాధితుడు ఎస్ఐ, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ త్రిలోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నప్పుడు గానీ,దొంగతనానికి గురైనప్పుడు గానీ వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సీఈఐఆర్' పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను సులభంగా ట్రేస్ చేయవచ్చుని,ఫోన్ పోయిన వెంటనే ఐఎంఈఐ నెంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై రేగొండ పోలీసుల మెరుపు దాడులు

**- దుంపిల్లపల్లిలో అక్రమ మద్యం తయారీదారుడిపై కేసు నమోదు**

**- అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు:రేగొండ ఎస్సై సుధాకర్**

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ



మండల పరిధిలో గుడుంబాను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేశారు. శుక్రవారం రేగొండ పోలీసులు దుంపిల్లపల్లి గ్రామంలోని పలు అక్రమ గుడుంబా తయారీ స్థావరాలపై ఆకస్మిక మెరుపు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో అల్లె సారయ్య అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన సుమారు 4 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు రేగొండ ఎస్సై డి. సుధాకర్ వెల్లడించారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో రహస్యంగా గుడుంబా తయారీ, విక్రయాలుజరుగుతున్నాయని అందిన పక్కా సమాచారంతో పోలీస్ బృందం ఈ దాడులు చేపట్టింది.నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న గుడుంబాను సీజ్ చేసి, నిందితుడు అల్లె సారయ్యపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ.. గుడుంబా తయారీ, నిల్వ, రవాణా మరియు విక్రయం చట్టరీత్యా నేరమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుడుంబా వినియోగం వల్ల ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని, ప్రజలు తమ ప్రాణాలను పణంగా పెట్టకుండా ఆరోగ్యానికి హానికరమైన నాటు సారాకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారి వివరాలను రహస్యంగా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన కోరారు. మండలంలో గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# మూడెత్తుల తండాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**- కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి - సర్పంచ్ లక్‌పతి**

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 24



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం మూడెత్తుల తండా గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మూడు లక్‌పతి ప్రారంభించారు.జిల్లా సమైక్య కోశాధికారి, పర్వతగిరి మండల సమైక్య అధ్యక్షురాలు స్వప్నతో కలిసి ఆయన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్‌పతి మాట్లాడుతూ సెర్ప్, ఐకేపీ గ్రామైక్య సంఘాల మహిళల ద్వారా నిర్వహించబడుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు తాలు, మట్టి, గడ్డి లేకుండా శుద్ధి చేసిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు మాట్లాడుతూ నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాంటాలు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్, ఉప సర్పంచ్ జాటోతు రవీందర్, వార్డు సభ్యులు, ఏపీఎం రాజీరు, సీసీలు గోలి కొమురయ్య, శ్యామ్సన్, దేవేంద్ర, ఎఫ్‌పీసీ సీఈఓ శ్రీనివాసు, వీవో ప్రతినిధులు, వీవోఏలు మహేశ్వరి, సంతోష, రమేష్, రేణుక, రమాదేవి, ఏఈవోలు, వివిధ పార్టీల నాయకులు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలు చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి కేటలిస్టులు:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు









తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలే తొలి పునాది అని, ఇవి 'అమ్మవడి తర్వాత మొదటి బడి'గా నిలుస్తూ సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భూపాలపల్లి డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ,సంక్షేమ వారోత్సవాల ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో 'సేవా సైనికుల్లా' అంకితభావంతో పని చేస్తున్నారని వారిని అభినందించారు.ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన స్థలాలు కేటాయించి, సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అంగన్‌వాడీ సేవలను డిజిటలైజ్ చేయడం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అందుకే ప్రభుత్వం అత్యాధునిక స్మార్ట్‌ఫోన్లను అందజేస్తోందని తెలిపారు.ప్రతి బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు అందేలా చూడాలని, పోషకాహార లోపం లేని సమాజ స్థాపనలో అంగన్‌వాడీల పాత్ర అద్వితీయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆదేశాల మేరకు భూపాలపల్లి డివిజన్‌లోని 418 మంది అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 'పోషణ మాసం' కార్యక్రమాలు ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని, మారుమూల ప్రాంతాల్లో కూడా సేవలందించడంలో సిబ్బంది చూపుతున్న చొరవ అభినందనీయమని అన్నారు. డిజిటల్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రతి గర్భిణీ, చిన్నారి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం వల్ల పథకాల అమలులో జాప్యం జరగదని, లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం చేరుతుందని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ చిన్నారుల విద్యా ప్రగతిని ప్రతిబింబించే ప్రోగ్రెస్ రిపోర్టులను ఎమ్మెల్యే మరియు కలెక్టర్ కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థల ఛైర్మన్ రాజబాబు, మున్సిపల్ ఛైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ ఛైర్మన్ అంబాల శ్రీనివాస్, మహిళా శిశు సంక్షేమ అధికారి మల్లీశ్వరి, జిల్లా కౌన్సిలర్లు, ఆర్టీఐ సభ్యులు రామచంద్రయ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి:ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

రైతు సంక్షేమమే ధ్యేయంగా,వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో యాసంగి (రబీ) ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు మరియు రవాణా కాంట్రాక్టర్లతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తాను స్వయంగా కల్లాలు సందర్శిస్తున్నప్పుడు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చాయని, తూకం వేయగానే ధాన్యాన్ని వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించేలా లారీలను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. కాటా వేసిన వెంటనే రైతులకు ట్రక్ షీట్లు అందజేయాలని, ఇందులో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మరో నెల రోజుల పాటు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ, అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నీడ, తాగునీరు,ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి కనీస వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.రద్దీని నియంత్రించేందుకు వ్యవసాయ అధికారులు రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేయాలని, అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయవద్దని, ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి జీపీఎస్ సదుపాయం ఉండాలని స్పష్టం చేశారు. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతిలో జాప్యం కలగకుండా హమాలీలను అందుబాటులో ఉంచాలని, సమస్యల పరిష్కారం కోసం ఐడీఓసీలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాల సంస్థ డీఎం రాములు, సరఫరాల అధికారి కిరణ్ కుమార్, సహకార అధికారి వాలియా నాయక్, డీఆర్‌డీఓ బాలకృష్ణ,వ్యవసాయ అధికారి బాబురావు,మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,రవాణా అధికారి సంధాని,ఇతర శాఖల అధికారులు,రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**- రాంపురం ప్రధానోపాధ్యాయులు హీరాలాల్,ఉపాధ్యాయుడు గుర్రం వెంకన్న గౌడ్**





తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని పిల్లలందరిని కూడా బడిలో చేర్పించి మన పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ప్రాథమిక పాఠశాల రాంపురం ప్రధానోపాధ్యాయులు హీరాల లాల్ మరియు ఉపాధ్యాయులు గుర్రం వెంకన్న గౌడ్ అన్నారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని వార్డు సభ్యులు సతీష్ ,తల్లిదండ్రులతో కలిసి అంబేద్కర్ విగ్రహం దగ్గర పాఠశాల యొక్క మౌలిక వసతులు మరియు ప్రత్యేకతలకు సంబంధించినటువంటి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కరపత్రాన్ని ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు పంచి పెడుతూ ముందస్తుగానే రాంపురంలోని పిల్లలు కలిగినటువంటి విద్యార్థుల యొక్క తల్లిదండ్రులను ఎండను సైతం లెక్కచేయకుండా మండుటెండల్లో ప్రతి ఒక్కరిని కలిసి పాఠశాలలో అత్యున్నతమైన విద్యార్హతలు,అనుభవం కలిగినటువంటి ఉపాధ్యాయులు ఉన్నామని అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం ,సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, వారానికి మూడు కోడిగుడ్లు వీటితో పాటుగా వచ్చే సంవత్సరం పాలు ,బ్రేక్ ఫాస్ట్ ,బ్యాగు, షూ వంటి అన్నింటిని కూడా ఉచితంగానే అందిస్తుందని ప్రభుత్వం అందించేటువంటి ఈ సౌకర్యాలను ఉపయోగించుకొని అనుభవజ్ఞులైన అన్ని సౌకర్యాలు కలిగినటువంటి మన పాఠశాలలో చదివించి పాఠశాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా తోడ్పడాలని కోరారు,ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు అప్పటికప్పుడే స్పందించి తమ పిల్లల్ని ఇంటి దగ్గరే అడ్మిషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో బంధు పరశురాములు, సుదగాని శ్రీను, సుదగాని హరీష్, నాగబెల్లి సురేష్ మరియు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మంతెన నారాయణ రెడ్డికి ఘన నివాళులు






**తెలుగు గళం న్యూస్ జనగామ/కొత్తగూడెం ఏప్రిల్ 24**
ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కమ్యూనిస్టు ఉద్యమ నేత, పీడిత ప్రజల పక్షపాతి, రైతు సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మంతెన నారాయణ రెడ్డి 32వ వర్ధంతిని పురస్కరించుకుని రైతు సంఘం రాష్ట్ర 3వ మహాసభల్లో ఘనంగా నివాళులు అర్పించారు.మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, రైతు సంఘం సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ తదితరులు నారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన రైతు ఉద్యమానికి అందించిన సేవలను స్మరించుకుంటూ నాయకులు నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మోకు కనకారెడ్డి, ఉడుత రవీందర్, బాలకృష్ణతో పాటు ఉమ్మడి జిల్లా నాయకులు ఏం.చుక్కయ్య, ఎం.కుమారస్వామి, శెట్టి వెంకన్న, ఈసంపెల్లి బాబు పాల్గొన్నారు. అలాగే జనగామ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, కార్యదర్శి భుక్యా చందు నాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మునిగెల రమేష్, ప్రజాసంఘాల నాయకులు సాదం రమేష్, మాచర్ల సారయ్య, బెల్లంకొండ వెంకటేష్, మోకు భవాని, ఘనపూర్ నాయకులు లింగనబోయిన కుమార్, కత్తుల రాజు, మంద మొగిలి తదితరులు హాజరయ్యారు.ఉమ్మడి జిల్లా రైతు సంఘం నాయకత్వం, మహాసభ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంతెన నారాయణ రెడ్డి సేవలను స్మరించుకున్నారు.

# కూనూరు బడిబాటలో...వినూత్న రీతిలో విద్యార్థుల చేరిక







**తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ ఏప్రిల్ 24**
పాఠశాల చివరి పని దినమైన 23 ఏప్రిల్ రోజున జఫర్గడ్ మండలం కూనూరు ఉన్నత పాఠశాలలో వినూత్నమైన రీతిలో విద్యార్థులను చేర్చుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ పర్వాజ్ తెలిపారు.బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు కూనూరు ప్రాథమిక పాఠశాల నుండి 25 మంది విద్యార్థులను ర్యాలీగా వెళ్లి గులాబీ పుష్పాలు అందించి స్వాగతం పలికి బ్యాండ్ చప్పుళ్లతో 6వ తరగతిలో అడ్మిషన్స్ చేసినట్లు వారు తెలిపారు.విద్యార్థుల చేరికకు సహకరించిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందానికి పర్వాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కూనూరు గ్రామంతో పాటు,పరిసర గ్రామాలైన రఘునాథపల్లి కోనాయిచలం గర్మిళ్లపల్లి తదితర గ్రామాల ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులను చేర్చుకొనుటకు ప్రణాళిక రూపొందించి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.పీఎం శ్రీ కూనూరు యందు అనేక వసతులు కల్పించబడ్డాయని తల్లిదండ్రు లు విద్యార్థులు ఆలోచించి డబ్బులను వృధా చేయకుండా శుచి శుభ్రత కలిగిన మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్య మరియు నోట్ పుస్తకాలు,రెండు జతల బట్టలు చక్కటి విద్యా బోధనతో పాటు క్రీడలు యోగా బ్యూటీషియన్ కంప్యూటర్ ఉ కరాటే తదితర అంశాలలో శిక్షణ ఇస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కనుక సకల వసతులు కలిగిన కూనూరు ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలను ఎంచుకొని విద్యార్థులను చేర్పించాలని మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని హెడ్మాస్టర్ పర్వాజ్ హితువు పలికారు.ఇట్టి కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రేడియం స్టిక్కర్లు అంటిద్దాం-రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం:రేగొండ ఎస్సై సుధాకర్





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
రోడ్డు ప్రమాదాల రహిత మండలంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'అలైవ్ అరైవ్' కార్యక్రమంలో భాగంగా రేగొండ పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం రేగొండ ఎస్సై సుధాకర్ దాసరి మండలంలోని ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం రూపిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాత్రి సమయాల్లో వెలుతురు సరిగ్గా లేని చోట,మలుపుల వద్ద ట్రాక్టర్ల వల్ల జరిగే ప్రమాదాలను అరికట్టడానికి 'రేడియం స్టిక్కర్లు' రక్షణ కవచంలా పనిచేస్తాయని పేర్కొన్నారు.

**ప్రమాదాల నివారణకు ఎస్సై సూచనలు:**
రేడియం స్టిక్కర్లు తప్పనిసరి ప్రతి ట్రాక్టర్ ముందు భాగంలో,మడిగారు రేకులకు, ట్రాలీ వెనుక భాగంలో పక్కల వైపు తప్పనిసరిగా నాణ్యమైన రేడియం స్టిక్కర్లను అతికించాలి. దీనివల్ల ఎదురుగా వచ్చే వారికి, వెనుక నుంచి వచ్చే వాహన దారులకు దూరం నుండే వాహనం కనిపిస్తుందని, తద్వారా అప్రమత్తమై ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.
లైటింగ్ వ్యవస్థ ప్రతి వాహనానికి హెడ్ లైట్లు, ఇండికేటర్లు, బ్రేక్ లైట్లు ఖచ్చితంగా పనిచేసేలా చూసుకోవాలని,లైటింగ్ సరిగ్గా లేని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పత్రాల నిర్వహణ**
ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి ఇన్సూరెన్స్ గడువులో ఉండాలని స్పష్టం చేశారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు :**
ముఖ్యంగా చిన్న వయస్సు వారికి (మైనర్లకు) వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు. "ప్రాణం చాలా విలువైంది, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వారవుతారు" అని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రేగొండ పోలీస్ సిబ్బంది,మండల ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు..ప్రభుత్వంలో విలీనం చేయాలి



**హనుమకొండ చౌరస్తా :** ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసంనిర్వహిస్తున్న సమ్మెకు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ(సంఘీభావం తెలిపింది. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చర్చలు జరిపి సమ్మెను విరమింపచేయాలని జేఏసీ చైర్మన్ డి.తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం కేయూలో జరిగిన జేఏసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు .ఎన్నికల ముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల చెల్లింపు, కార్మిక సంఘం ఎన్నికలు, ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ హామీ లను విస్మరిస్తుందని ఆరోపించారు.అప్రభుత్వంలో విలీనం, ఉద్యోగాల భర్తీ, కార్మికుల బకాయిల ద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఎలక్ట్రిసిటీ బస్సులు ప్రైవేటు వ్యక్తుల ద్వారా కొనుగోలు చేసి -ని విమర్శించారు. సమావేశంలో విద్యార్థి జేఏసీ సీనియర్ నాయకుడు కలకోట్ల సుమన్, కన్వీనర్ కందికొండ తిరుపతి, కార్యదర్శి జనగాం రాజారాం, నాయకులు బొక్క ప్రవర్ధన్, రోనాల్డ్??, అశోక్, నరేష్, కుమార్, పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి:నలుగురు జూదరుల అరెస్ట్

**- నగదు,పేకముక్కలు స్వాధీనం చేసుకున్న కొత్తపల్లి గోరి పోలీసులు**
**- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు:ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి**



**తెలుగు గళం న్యూస్ కొత్తపల్లి గోరి**
కొత్తపల్లి గోరి మండల పరిధిలో జూదాన్ని నిర్మూలించేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు.కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్ పరిధిలోని దామరంచపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు.ఈ దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి వెల్లడించారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దామరంచపల్లి శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం అందింది. దీనిపై వెంటనే స్పందించిన ఎస్ఐ తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.పోలీసుల రాకను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించిన నలుగురిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ. 2,500 నగదు,పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన వారిని దామరంచపల్లి గ్రామానికి చెందిన బొట్ల రాజు (37), కోలేపాక రమేష్ (38), కడపాక సుమన్ (30), మరియు జూపాక అశోక్ (42)గా గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పేకాట, కోడి పందాలు వంటి జూద క్రీడలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది కుమారస్వామి, సుమన్, నవీన్, ఉపేందర్, లింగన్న ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం:ఇసుక ట్రాక్టర్ సీజ్

**అనుమతి లేకుండా తరలిస్తున్న యజమాని,డ్రైవర్‌పై కేసు నమోదు**
**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు:ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి**




**తెలుగు గోళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**
మండల పరిధిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు.టేకుమట్ల -- కలికిటపల్లి వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను శుక్రవారం కొత్తపల్లి గోరి పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి వెల్లడించారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గోరి మండలం దామరంచపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారంతో పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వాగు నుండి ఇసుకను లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా,ఎలాంటి ప్రభుత్వ అనుమతి పత్రాలు లేవని తేలింది. దీంతో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కొమ్ము కుమార్, వాహన యజమాని మోరే నరేష్‌లను నిందితులుగా గుర్తించి, వారిపై చట్టపరమైన కేసు నమోదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్ఐ త్రిలోక్ నాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా అక్రమ మైనింగ్ లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.రాత్రి సమయాల్లో నిఘాను మరింత తీవ్రతరం చేస్తామని,నిబంధనలు అతిక్రమించే వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేదాకా ఉద్యమం



**కోదాడ, ఏప్రిల్ 24 :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేదాకా ఉద్యమం కొనసాగుతుందని ఆర్టీసీ కార్మిక నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం కోదాడ డిపో ఆవరణలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. బస్సులు డిపో నుండి బయటకు రాకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. తాత్కాలిక ఉద్యోగులతో బస్సులు నడపడంతో ప్రయాణికులకు భద్రత కరువైందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సమ్మె ఉధృతం అయిందని సమస్యలు పరిష్కరించే దాకా వెనకకు తగ్గేది లేదన్నారు. ప్రభుత్వం చర్చలు చేయకపోవడంతో మనస్థాపన చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకున్నాడని, మరో ఇద్దరిదీ ఇదే పరిస్థితి అని తక్షణమే సమస్యల పరిష్కారానికి జరుగుతున్న చర్చలను మంత్రులు సఫలం చేయాలన్నారు.
కాగా సమ్మెకు ఏఐటీయూసీ, సిఐటియు, బీఆర్ఎస్ కార్మిక విభాగం, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు బెజవాడ వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, ముత్యాలు రాంబాబు, ఎస్కే నయీమ్, రావెళ్ల సీతారామయ్య, రఘు, వేనేపల్లి శ్రీనివాసరావు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. మృతి చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఫ్లెక్సీకి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకర గౌడ్ అమర్ హై.. జోహార్ లంటూ నినాదాలు చేస్తూ డిపో ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ధర్నాలో కార్మిక నాయకులు పుల్లయ్య, అబ్దుల్, ఉప్పలయ్య, రాజశేఖర్, కె.వి రత్నం, ఎస్ఎస్ రావు, అంజలి, జ్యోతి, చుక్కమ్మ, శ్రీదేవి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్.

ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో ఏ చెన్నై బ్యాటర్‌కు సాధ్యం కాని రికార్డును సంజూ శాంసన్ తన ఖాతాలో వేసుకున్నాడు. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంజూ శాంసన్ వీరవిహారం చేశాడు. కేవలం 54 బంతుల్లోనే 101 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో సంజూ కేవలం తన జట్టును గెలిపించడమే కాకుండా, ఐపీఎల్ చరిత్రలో చెన్నై తరపున ఎవరికీ సాధ్యం కాని సరికొత్త రికార్డులను సృష్టించాడు.ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య ఎన్నో హోరాహోరీ పోరులు జరిగాయి. కానీ 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్‌పై సెంచరీ బాదిన తొలి చెన్నై బ్యాటర్‌గా సంజూ శాంసన్ రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు ముంబైపై రుతురాజ్ గైక్వాడ్ చేసిన 88 పరుగులే అత్యధికం. ఇప్పుడు ఆ రికార్డును చెరిపివేసి సంజూ చరిత్ర పుటల్లోకెక్కాడు.

సంజూ శాంసన్ ఐపీఎల్ 2026లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో ఆయనకు ఇది రెండో సెంచరీ. చెన్నై సూపర్ కింగ్స్ చరిత్రలో ఒకే సీజన్‌లో రెండు సెంచరీలు చేసిన రెండో బ్యాటర్‌గా సంజూ నిలిచాడు. 2018లో షేన్ వాట్సన్ ఈ ఘనత సాధించగా, ఇప్పుడు సంజూ ఆ క్లబ్‌లో చేరాడు. ముంబై బౌలర్లను చీల్చి చెండాడుతూ ఆయన చేసిన 101 పరుగుల ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 6 భారీ సిక్సర్లు ఉన్నాయి.చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ల జాబితాలో సంజూ శాంసన్ ఇప్పుడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. మురళీ విజయ్, షేన్ వాట్సన్, రుతురాజ్ గైక్వాడ్ తలో రెండు సెంచరీలు చేయగా, సంజూ కూడా తన రెండో సెంచరీతో వారి సరసన చేరాడు. వాంఖడే స్టేడియం సంజూకి బాగా కలిసొస్తుందని ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది.


కేవలం ఐపీఎల్ లోనే కాకుండా ఓవరాల్ టీ20 క్రికెట్‌లో కూడా సంజూ శాంసన్ రికార్డులు సృష్టిస్తున్నాడు. టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయ బ్యాటర్ల జాబితాలో



# చంపక్ కుక్కతో ధోనీ బాబు కుస్తీ..

ఐపీఎల్ 2026లో ఎల్-క్లాసికోగా పిలవబడే ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ పోరుకు రంగం సిద్ధమైంది. అయితే, ఈ మ్యాచ్ కంటే ముందే ఎంఎస్ ధోనీకి సంబంధించిన ఒక క్రేజీ వీడియో సోషల్ మీడియాను ఊపేస్తోంది. గాయం కారణంగా ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోనీ.. ప్రాక్టీస్ సెషన్‌లో ఒక రోబోట్ కుక్కతో సరదాగా గడిపిన దృశ్యాలు అభిమానులను కట్టిపడేస్తున్నాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగే భారీ పోరుకు ముందు ధోనీ తనలోని సరదా కోణాన్ని బయటపెట్టారు. చంపక్ అనే రోబోట్ డాగ్‌తో ధోనీ ఆడుకుంటున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అందులో ధోనీ నేలపై పడుకుని రోబోట్ కుక్క చేసే విన్యాసాలను అనుకరిస్తూ వ్యాయామం చేయడం కనిపిస్తోంది. అయితే, సరదాగా సాగుతున్న ఈ సమయంలో ధోనీ ఒక్కసారిగా వెనుకకు వెళ్లే క్రమంలో కాస్త గట్టిగా జారిపడ్డారు. ఇది చూసిన అభిమానులు ఆయన గాయం గురించి ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, ధోనీ మాత్రం చిరునవ్వుతో దానిని తేలికగా తీసుకున్నారు.

ఐపీఎల్ 2026 ప్రారంభానికి ముందే ధోనీ క్వాడ్రిసెప్స్ స్ట్రెయిన్ (కండరాల గాయం) బారిన పడ్డారు. దీనివల్ల ఆయన తొలి 6 మ్యాచ్‌లకు దూరమయ్యారు. జట్టుతో కలిసి ట్రావెల్ చేయకుండా కేవలం చెన్నైలోనే ఉండి కోలుకున్నారు. అయితే బుధవారం వాంఖడే స్టేడియంలో ధోనీ ప్రాక్టీస్ కిట్ ధరించి బ్యాటింగ్, వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేయడం చూస్తుంటే.. ముంబైతో మ్యాచ్‌లో ఆయన ఆడే



అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. నెట్స్‌లో గంటపాటు బ్యాటింగ్ చేసిన ధోనీ, కొన్ని బంతులను స్టాండ్స్‌లోకి పంపడం విశేషం.

ఈ సీజన్ ఎల్-క్లాసికోలో ఇద్దరు దిగ్గజాల లభ్యతపై సందిగ్ధం కొనసాగుతోంది. ముంబై స్టార్ రోహిత్ శర్మ హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా గత 10 రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం ఆయన బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినప్పటికీ, తుది నిర్ణయం టాస్ సమయంలోనే వైద్య బృందం తీసుకుంటుంది. ధోనీ విషయంలో కూడా బౌలింగ్ కోచ్ ఎరిక్ సిమన్స్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మెడికల్ టీమ్, స్వయంగా ధోనీ సంతృప్తి చెందితేనే మైదానంలోకి అడుగుపెడతారని తెలిపారు.వాంఖడే స్టేడియం రోహిత్, ధోనీలకు పుట్టినిల్లు లాంటిది. రోహిత్ ముంబైని 5 సార్లు ఛాంపియన్‌గా నిలబెడితే, ధోనీ ఇదే మైదానంలో 2011 ప్రపంచ కప్ సిక్సర్ బాదారు. కాబట్టి ఈ ఇద్దరూ ఈ రాత్రి మ్యాచ్‌లో తలపడితే చూడాలని కోట్లాది మంది ఎదురుచూస్తున్నారు. గాయాల మధ్య కూడా వీరిద్దరూ ప్రాక్టీస్‌లో చెమటోడ్చడం చూస్తుంటే, ఒకరు బ్యాటింగ్‌లో మెరుపులు మెరిపిస్తే, మరొకరు ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చే అవకాశం ఉందని సమాచారం.

# నిజమే.. నాకు ఒళ్లంతా ఈగో ఉంది

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా తనలోని కొత్త కోణాన్ని ఆవిష్కరించారు. బుధవారం లక్నో సూపర్ జెయింట్స్ (రూ+)పై రాజస్థాన్ విజయం సాధించిన తర్వాత జడేజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. తన వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని చాటిచెప్పిన జడేజా, ఆట పట్ల తనకున్న నిబద్ధతను చాటుకున్నారు.ఐపీఎల్ 2026లో చెన్నైని వీడి రాజస్థాన్ రాయల్స్ లో చేరిన జడేజాకు కొన్ని మ్యాచ్‌ల్లో పూర్తి స్థాయిలో బౌలింగ్ చేసే అవకాశం రావడం లేదు. తన కోటాలో ఉన్న 4 ఓవర్లను పూర్తి చేయకముందే కెప్టెన్ బౌలింగ్ ఆపేస్తున్నా, జడేజా ఏమాత్రం అసహనానికి గురికావడం లేదు. దీనిపై స్పందిస్తూ.. "నేను మైదానంలోకి అడుగుపెట్టే ముందే నాకు ఉన్న ఈగోను హోటల్ గదిలోనే వదిలేసి వస్తాను. జట్టు నన్ను ఏ బాధ్యత కోరినా అది నెరవేర్చడమే నా లక్ష్యం. వ్యక్తిగత ప్రదర్శన కంటే టీమ్ గెలుపే ముఖ్యం" అని జియో హాట్‌స్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. లక్నోతో జరిగిన మ్యాచ్‌లో జడేజా 29 బంతుల్లో 43 పరుగులు చేసి అజేయంగా నిలిచారు. చివరి వరకు క్రీజులో ఉండటం వల్లే రాజస్థాన్ 159 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. "నేను గనుక 17 లేదా 18వ ఓవర్లో అవుట్ అయి ఉంటే, మేము మరో 20-25 పరుగులు తక్కువ చేసేవాళ్లం. అప్పుడు లక్నోకు లక్ష్యం సులువయ్యేది. కానీ వికెట్ కండిషన్స్ అర్థం చేసుకుని నెమ్మదిగా బౌలింగ్ చేయడం మాకు కలిసొచ్చింది" అని జడేజా వివరించారు. ఈ మ్యాచ్‌లో ఆయన బ్యాటింగ్‌తో పాటు 4 ఓవర్లలో 29 పరుగులిచ్చి ఒక కీలక వికెట్ కూడా తీశారు.మరోవైపు లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ బ్యాటింగ్ తీరుపై మాజీ



కోచ్ సంజయ్ బంగర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం మూడు బంతులు ఆడి, అనవసరమైన షాట్‌కు ప్రయత్నించి డకౌట్ అవ్వడం బాధ్యతారాహిత్యమని బంగర్ అన్నారు. పంత్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఆడిన అనుభవం ఉన్నప్పటికీ, పరిస్థితులకు తగ్గట్టుగా ఆడకుండా వికెట్ పారేసుకోవడం జట్టు ఓటమికి కారణమైందని ఆయన విశ్లేషించారు.ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 40 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లతో చెలరేగగా, బ్రిజేష్ శర్మ, నంద్రే బర్గర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. పిచ్ మందకొడిగా ఉండటాన్ని గమనించిన రాజస్థాన్ బౌలర్లు లక్నోను 119 పరుగులకే కట్టడి చేశారు. అద్భుత ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన రవీంద్ర ు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

# సంక్షోభంలో సాఫ్ట్‌వేర్.. ప్రమాదంలో మైక్రోసాఫ్ట్, మెటాకు చెందిన 23,000 మంది ఉద్యోగులు!

టెక్ ప్రపంచంలో అగ్రగామి సంస్థలైన మైక్రోసాఫ్ట్, మెటా ప్లాట్‌ఫామ్స్ తీసుకున్న తాజా నిర్ణయాలు వేలాది మంది ఉద్యోగుల భవిష్యత్తును ప్రశ్నార్థకం మారనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ) రంగంలో పట్టు సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఉద్యోగుల కొంపముంచుతోంది. ఈ క్రమంలోనే భారీ పెట్టుబడులు, పెరిగిన వ్యయాలు ఈ సంస్థలను కఠిన నిర్ణయాల దిశగా నడిపించాయి. ఖర్చులను తగ్గించుకోవడానికి ఈ రెండు దిగ్గజ సంస్థలు సుమారు 23,000 మంది ఉద్యోగులపై ప్రభావం చూపే ప్రణాళికలను రూపొందించాయి.సోషల్ మీడియా దిగ్గజం మెటా తన అంతర్గత మెమోలో ఈ ప్రకటన చేసింది. సంస్థలోని మొత్తం సిబ్బందిలో 10 శాతం అంటే సుమారు 8,000 మందిని తొలగించనున్నట్లు పేర్కొంది. మే 20 నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియతో పాటు, సంస్థలోని 6,000 ఖాళీలను కూడా భర్తీ చేయకూడదని నిర్ణయించుకుంది. కంపెనీని మరింత సమర్థవంతంగా, చురుకుగా మార్చే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మెటా స్పష్టం చేసింది. మరోవైపు, మైక్రోసాఫ్ట్ తన అమెరికా ఉద్యోగుల కోసం భారీ స్వచ్ఛంద పదవీ విరమణపథకాన్ని ప్రకటించింది. అమెరికాలోని 1.25 లక్షల మంది ఉద్యోగులలో దాదాపు 7 శాతం మంది, అంటే 8,750 మంది ఈ ఆఫర్‌కు అర్హులుగా తెలుస్తోంది. మైక్రోసాఫ్ట్ చరిత్రలోనే ఇది అతిపెద్ద బైఅవుట్ కార్యక్రమంగా నిలవనుంది.




ప్రస్తుతం టెక్ రంగం మొత్తం ూ× మంత్రం జపిస్తోంది. మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా కొత్త డేటా సెంటర్ల నిర్మాణంతో పాటు జపాన్, ఆస్ట్రేలియాల్లో బిలియన్ల కొద్దీ పెట్టుబడులు పెడుతోంది. మెటా సైతం ఏఐ భాగస్వామ్యాల కోసం రికార్డు స్థాయి వ్యయం చేస్తోంది. ూ× ద్వారా పెట్టుబడుల భారం తగ్గించుకోవాలని దిగ్గజ సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. కృత్రిమ మేధ కోసం చేస్తున్న భారీ ఖర్చులను సమతుల్యం చేయడం కోసం సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాగే తక్కువ మానవ వనరులతో సాంకేతికత ద్వారా ఎక్కువ ఫలితాలను సాధించాలని సాఫ్ట్‌వేర్ సంస్థలు భావిస్తున్నాయి. మారుతున్న మార్కెట్ పునర్నిర్మించాలనుకుంటున్నాయి. టెక్ రంగ మనుషుల కంటే మెషీన్ లెర్నింగ్, ఏఐ మౌలిక సదుపాయాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ ధోరణి కొనసాగితే, రాబోయే రోజుల్లో టెక్ రంగంలో మరిన్ని ఉద్యోగ కోతలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# క్రెడిట్ కార్డు క్యాష్‌బ్యాక్, రివార్డులపై ట్యాక్స్ ఉంటుందా..?

ఈ రోజుల్లో క్రెడిట్ కార్డులు దాదాపు ప్రతి ఒక్కరు వాడుతున్నారు. కానీ నెలవారీ బిల్లు జనరేట్ అయిన వెంటనే, ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతుంది. స్టేట్‌మెంట్ అందిన వెంటనే బిల్లు చెల్లించాలా, లేదా గడువు తేదీ వరకు వేచి ఉండటం మంచిదా? బిల్లు చెల్లింపు సమయం మీ క్రెడిట్ స్కోర్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది కాబట్టి ఈ గందరగోళం తరచుగా వినియోగదారులలో కొనసాగుతుంది. ఈ విషయంలో సరైన దశలను, అది మీ ఆర్థిక జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం..మీ ఇమెయిల్ లేదా ఫోన్‌లో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్ సందేశం వచ్చినప్పుడు, చాలా మంది గడువు తేదీ వరకు వేచి ఉంటే వారి జ×దీ×ూ స్కోరు పడిపోతుందేమో అని ఆందోళన చెందుతారు. వాస్తవం ఏమిటంటే మీరు స్టేట్‌మెంట్ వచ్చిన వెంటనే చెల్లించాలా లేదా గడువు తేదీలోపు మీ బిల్లును చెల్లించడానికి గ్రేస్ పీరియడ్‌ని ఉపయోగించాలా అనేది మీ క్రెడిట్ స్కోరుకు పట్టింపు లేదు. మీ చెల్లింపు బ్యాంకు నిర్దేశించిన గడువులోపు జరిగితే, మీ ఆర్థిక రికార్డు పూర్తిగా సురక్షితంగా ఉంటుంది. మీ ఆర్థిక సౌలభ్యం, నగదు లభ్యతను బట్టి మీరు ఏదైనా ఎంపికను ఎంచుకోవచ్చుగడువు తేదీ వరకు వేచి ఉండటంలో తప్పు లేదు, కానీ నిర్లక్ష్యం కారణంగా ఈ గడువు దాటితే, మీకు నిజమైన ఇబ్బంది మొదలవుతుంది. బ్యాంకు గడువు తర్వాత చెల్లింపు చేయడం ఆలస్య చెల్లింపుగా




పరిగణించబడుతుంది. ఇది మీ మొత్తం క్రెడిట్ చరిత్రను తీవ్రంగా దెబ్బతీసే తీవ్రమైన తప్పు. మీ జ×దీ×ూ స్కోరు దెబ్బతిన్న తర్వాత, భవిష్యత్తులో గృహ రుణం, కారు రుణం లేదా కొత్త కార్డు పొందడం చాలా కష్టం అవుతుంది. అందువల్ల, బిల్లులను సకాలంలో చెల్లించడం ఆర్థిక ప్రాధాన్యతగా చేసుకోవడం చాలా ముఖ్యం.క్రెడిట్ కార్డ్ బిల్లింగ్ స్టేట్‌మెంట్‌లలో ఎల్లప్పుడూ రెండు రకాల మొత్తాలు కనిపిస్తాయి. మొత్తం బకాయి, కనీస బకాయి. కనీస మొత్తాన్ని లేదా కనీస బకాయిని చెల్లించడం వల్ల బ్యాంకు జరిమానాలను నివారించవచ్చని, వారి శ్రేయస్సును నిర్ధారిస్తుందని ప్రజలు తరచుగా అనుకుంటారు. అయితే ఆర్థిక దృక్కోణం నుండి, ఇది ఒక పెద్ద ఉచ్చు అని నిరూపించబడింది. మిగిలిన మొత్తం అంటే కనీస మొత్తం, వచ్చే నెలకు ముందుకు తీసుకెళ్లబడుతుంది. బ్యాంకులు దానిపై గణనీయమైన వడ్డీని వసూలు చేస్తాయి. ఈ అలవాటు క్రమంగా గణనీయమైన అప్పుకు దారితీస్తుంది. మీ క్రెడిట్ స్కోర్‌పై దాని ప్రతికూల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఎల్లప్పుడూ పూర్తి బిల్లును చెల్లించండి.

# రికార్డ్ స్థాయిలో తిరిగి పుంజుకున్న రూపాయి విలువ! 13 ఏళ్లలో తొలిసారి!

భారత కరెన్సీ మార్కెట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. =దీ× తీసుకున్న రెండు దశల కఠిన చర్యలు మార్కెట్‌ను ఒక్కసారిగా కుదిపేశాయి. ఈ చర్యల ప్రభావంతో గురువారం రూపాయి విలువ 1.8 శాతం పెరిగి 93.10 వద్ద ముగిసింది. ఇది దాదాపు 13 ఏళ్లలో అత్యంత భారీ ఒక్కరోజు లాభంగా నిలవడంతో పాటు, రూపాయి-డాలర్ సమతుల్యతను తాత్కాలికంగా మార్చింది. గత కొన్ని నెలలుగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటూ వచ్చింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గ్లోబల్ వాణిజ్య ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల వంటి కారణాల వల్ల 2026 ఆర్థిక సంవత్సరంలో రూపాయి దాదాపు 10 శాతం వరకు పడిపోయింది.మార్చి నెలలోనే అదనంగా 4 శాతం క్షీణించడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ సాధారణంగా అనుసరించే డాలర్ విక్రయాలు, వడ్డీ రేట్ల మార్పులు వంటి చర్యలు సరిపోకపోవడంతో, మరింత కఠిన నిర్ణయాలకు దిగింది. ప్రత్యేకంగా బ్యాంకులు ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ మార్కెట్ల మధ్య ధరల వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని ఆర్బిట్రేజ్ ట్రేడింగ్ ద్వారా లాభాలు ఆర్జిస్తున్నాయని ఆర్‌బిఐ గుర్తించింది. ఈ ప్రక్రియలో డాలర్‌కు కృత్రిమ డిమాండ్ పెరగడంతో రూపాయి మరింత బలహీనపడుతోంది. ఈ పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు, బ్యాంకుల నికర ఓపెన్ పొజిషన్‌ను కేవలం 100 మిలియన్ డాలర్లకు



పరిమితం చేస్తూ ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది.ఈ నిర్ణయం వల్ల పెద్ద ఎత్తున డాలర్ పొజిషన్లను తగ్గించాల్సి వచ్చిన బ్యాంకులు, మార్కెట్‌లో డాలర్లను అమ్మడం ప్రారంభించాయి. దాంతో సరఫరా పెరిగి రూపాయి బలపడింది. అయితే ఈ చర్యలతో బ్యాంకింగ్ రంగంపై ఒత్తిడి పెరిగింది. నిఫ్టీ బ్యాంక్ సూచీ సుమారు 4 శాతం పడిపోవడం మార్కెట్‌లోని ఆందోళనను ప్రతిబింబించింది. విశ్లేషకుల అంచనా ప్రకారం ఈ మార్పుల వల్ల బ్యాంకులకు వేల కోట్ల రూపాయల నష్టం సంభవించే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఆర్‌బిఐ చర్యలు కేవలం తాత్కాలిక జోక్యం కాకుండా, కరెన్సీ మార్కెట్‌లో నియంత్రణను బలోపేతం చేసే దిశగా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలుగా భావించబడుతున్నాయి. భవిష్యత్తులో గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, మూలధన ప్రవాహాలు రూపాయి దిశను నిర్ణయించనున్నాయి.



## పొద్దున్నే ఆ ఒక్క జ్యూస్ తాగడం వల్లే.. 66 ఏళ్ల వయసులో నాగార్జున జుట్టు రహస్యం ఇదే..

సినీ పరిశ్రమలో బతికితే అక్కినేని నాగార్జునలాగా బతకాలి అని చాలామంది హీరోలు అంటుంటారు. 66 ఏళ్ల వయసులో పాతికేళ్ల కుర్రాడిలా కనిపిస్తూ యంగ్ హీరోలకు పోటీ ఇస్తున్నారు నాగ్. అంతేకాదు.. ఆయన లాంగ్ హెయిర్ స్టైల్ కు ఫ్యాన్స్ సైతం ఆశ్చర్యపోతున్నారు. ఆయన సంపదను పక్కన పెడితే, నాగార్జున జీవనశైలి, శరీరం నిర్వహణ, ఆహారపు అలవాట్లు ఎంతోమందికి ఆదర్శం. ఈ ఆరోగ్య రహస్యాలను ఆయన వ్యక్తిగత మేకప్ మ్యాన్ చంద్ర ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.నాగార్జున వారంలో ఐదు రోజులు మితంగా సాధారణ ఆహారాన్ని తీసుకుంటారు. అల్పాహారంలో ఒక ఇడ్లీ, వడ లేదా గారె వంటివి మాత్రమే తింటారు. ఆయన ఆకలేసినప్పుడు మాత్రమే తినడానికి ప్రాధాన్యత ఇస్తారు. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా బెండకాయ, హాట్ చిప్స్ ఉంటాయి. అన్నం దంపుడు బియ్యంతో వండినది అయి ఉండాలి, అది కూడా మనం తినలేనంత మెత్తగా, ముద్దలాగా ఉండాలని ఆయన ఇష్టపడతారు. రసం, ఒక అరటిపండు కూడా భోజనంలో భాగం. శనివారం రాత్రి నాగార్జునకి పాంప్లెట్ చేపలు చాలా ఇష్టం, ఒకటి లేదా రెండు చేపలు తింటారు. ఈ చేపలను వెల్లుల్లి, అల్లం, మిరియాలు, ఆలివ్ ఆయిల్‌తో ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఆదివారం రెండు మూడు ముక్కల మటన్ లేదా చికెన్ తీసుకుంటారు.నాగార్జున వారంలో ఐదు రోజులు మితంగా సాధారణ ఆహారాన్ని తీసుకుంటారు. అల్పాహారంలో ఒక ఇడ్లీ, వడ లేదా గారె వంటివి మాత్రమే తింటారు. ఆయన ఆకలేసినప్పుడు మాత్రమే తినడానికి ప్రాధాన్యత ఇస్తారు. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా బెండకాయ, హాట్ చిప్స్ ఉంటాయి. అన్నం దంపుడు బియ్యంతో వండినది అయి ఉండాలి, అది కూడా మనం తినలేనంత మెత్తగా, ముద్దలాగా ఉండాలని ఆయన ఇష్టపడతారు. రసం, ఒక అరటిపండు కూడా భోజనంలో భాగం. శనివారం రాత్రి నాగార్జునకి పాంప్లెట్ చేపలు చాలా ఇష్టం, ఒకటి లేదా రెండు చేపలు తింటారు. ఈ చేపలను వెల్లుల్లి, అల్లం, మిరియాలు, ఆలివ్ ఆయిల్‌తో ప్రత్యేకంగా తయారు చేస్తారు. ఆదివారం రెండు మూడు ముక్కల మటన్ లేదా చికెన్ తీసుకుంటారు.నాగార్జున ప్రతిరోజూ క్రమం తప్పకుండా జిమ్ చేస్తారు. ఉదయం షూటింగ్‌కు రాగానే ఒక పెద్ద రాగి గ్లాసు నిండా ప్రత్యేక జ్యూస్‌ను ఖాళీ కడుపుతో తాగుతారు. ఈ జ్యూస్‌లో నిమ్మకాయ, ఉసిరికాయ, క్యారెట్, బీట్‌రూట్, పటికబెల్లం లేదా తేనె కలిపి ఇస్తారు. ఇదే ఆయన జుట్టు రాలకపోవడానికి ప్రధాన రహస్యమని చంద్ర తెలిపారు. అన్నమయ్య సినిమా మినహా, నాగార్జున తన కెరీర్‌లో విగ్గులు ఎక్కువగా ఉపయోగించలేదని చంద్ర పేర్కొన్నారు.నాగార్జున ప్రతిరోజూ క్రమం తప్పకుండా జిమ్ చేస్తారు. ఉదయం షూటింగ్‌కు రాగానే ఒక పెద్ద రాగి గ్లాసు నిండా ప్రత్యేక జ్యూస్‌ను ఖాళీ కడుపుతో తాగుతారు. ఈ జ్యూస్‌లో నిమ్మకాయ, ఉసిరికాయ, క్యారెట్, బీట్‌రూట్, పటికబెల్లం లేదా తేనె కలిపి ఇస్తారు. ఇదే ఆయన జుట్టు రాలకపోవడానికి ప్రధాన

## అదిరిపోయే చీర కట్టులో స్టార్..! ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆకట్టుకునే స్టైల్‌లో బ్యూటీ

‘రాజా శివాజీ’ ట్రైలర్ లాంచ్ వేడుకలో నటి జెనీలియా దేశ్‌ముఖ్ అందరి దృష్టిని ఆకర్షించింది. తన భర్త రితేష్ దేశ్‌ముఖ్‌తో కలిసి నటించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రం ప్రమోషన్స్ కోసం ఆమె పక్కా మహారాష్ట్రీయ సంప్రదాయ శైలిని ఎంచుకుంది. సంస్కృతిని మించిన ఫ్యాషన్ స్టేట్‌మెంట్ మరొకటి ఉండదని నిరూపిస్తూ, జెనీలియా నౌవారీ చీరలో దేవతలా మెరిసిపోయింది. తన మూలాలకు దగ్గరగా ఉండే ఈ వేషధారణలో ఆమె చూపిన హుందాతనం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. తన లుక్ గురించి ఇన్ స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, “నా మనసుకు దగ్గరగా ఉండే నౌవారీ చీరను ధరించాను. ఇది నా మూలాలకు గుర్తు. హిమ్రూ నేత, అహింసా సిల్క్ దీనిని మరింత ప్రత్యేకం చేశాయి” అని జెనీలియా పేర్కొన్నారు.హిమ్రూ నేత రాజసంమరాఠీ సంప్రదాయానికి నిలువుటద్దంలా నిలిచింది నటి జెనీలియా. తన భర్త రితేష్ ప్రతిష్టాత్మక చిత్రం ‘రాజా శివాజీ’ ట్రైలర్ లాంచ్‌లో పింక్ కలర్ నౌవారీ చీరలో మెరిసిపోయిన ఈ భామ, భారతీయ చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. తన మూలాలను ప్రతిబింబించేలా ఆమె ఎంచుకున్న ఆ అద్భుతమైన వేషధారణ విశేషాలేంటో తెలుసుకుందాం..జెనీలియా ఈ వేడుక కోసం ‘రైరీ బై శ్రేయా దేశ్‌ముఖ్’ బ్రాండ్ రూపొందించిన సాఫ్ట్ పింక్ కలర్ నౌవారీ చీరను ధరించారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ‘హిమ్రూ’ నేతతో, అహింసా సిల్క్ ఫ్యాబ్రిక్‌తో తయారైన ఈ చీర రాజసాన్ని ఉట్టిపడేలా చేసింది. దీనికి జతగా భారీ బంగారు రంగు ఎంబ్రాయిడరీ ఉన్న పింక్ దుపట్టాను ఆమె ధరించారు. ఈ కలర్ కాంబినేషన్ జెనీలియాకు ఒక సున్నితమైన మరియు శక్తివంతమైన రూపాన్ని ఇచ్చింది. కేవలం అందం కోసమే కాకుండా, చేనేత కళాకారుల నైపుణ్యాన్ని గౌరవించేలా ఆమె ఈ ఎంపిక చేయడం విశేషం.సంప్రదాయ అభరణాలతోమరాఠీ సంప్రదాయ లుక్ అంటేనే ఆభరణాల ప్రత్యేకత. జెనీలియా తన హెరిటేజ్ లుక్‌ను పూర్తి చేయడానికి ‘నాథ్’ (ముక్కు పుడక), ఆకుపచ్చని చంద్రకోర్ బిందీని ఎంచుకున్నారు. సన్జానీ, రాబ్తా బై రాహుల్ వంటి బ్రాండ్ల నుండి సేకరించిన భారీ లేలుక్‌ను పూర్తి చేయడానికి ‘నాథ్’ (ముక్కు పుడక), యర్డ్ నెక్లెస్‌లు, చేతులకు నిండుగా గాజులు ధరించి ఒక అసలైన మరాఠీ ఇల్లాలులా కనిపించారు. క్లాసిక్ బన్ హెయిర్ స్టైల్, పూల అలంకరణ ఆమె గ్రేస్‌ను మరింత పెంచాయి.‘అపరాజిత టూర్’ రూపొందించిన ట్రెడిషనల్ శాండల్స్ ఈ లుక్‌కు ఫినిషింగ్ టచ్ ఇచ్చాయి. స్టైలిస్ట్ కరిష్మా గులాటి ఆధ్వర్యంలో జెనీలియా మేకోవర్ అద్భుతంగా కుదిరింది. రితేష్ దేశ్‌ముఖ్ ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో కనిపిస్తుండగా, జెనీలియా ఆయన భార్య ‘సాయిబాయి’ పాత్రను పోషిస్తున్నారు. ట్రైలర్‌లో యుద్ధ సన్నివేశాలు, శివాజీ మహారాజ్ స్వరాజ్య పోరాటం ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేపుతున్నాయి.





## ఎన్నికల్లో ఓటేసిన తర్వాత త్రిష షేర్ చేసిన తొలి పోస్ట్ ఏంటో తెలుసా?

గత కొన్ని రోజులుగా ఎంతో ఉత్కంఠ రేపిన తమిళనాడు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈసారి డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు కోలీవుడ్ స్టార్ విజయ్ స్థాపించిన ‘తమిళగ వెట్రి కళగం(టీవీకే)’ పార్టీ కూడా ఎన్నికల బరిలోకి దిగింది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాల్లోనూ విజయ్ పార్టీ పోటీ చేస్తోంది. ఇక విజయ్ కూడా తిరుచురాపల్లి ఈస్ట్, పెరంబూర్ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. కాగా గురువారం (ఏప్రిల్ 23)న జరిగిన పోలింగ్ లో భారీ ఓటింగ్ నమోదైంది. సామాన్యులతో పాటు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు భారీ ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. టీవీకే అధినేత హీరో విజయ్, రజనీకాంత్, అజిత్, ధనుష్, శ్రుతి హాసన్, కమల్ హాసన్, త్రిష, ఖుష్బూ, శివ కార్తికేయన్, డైరెక్టర్ అట్లీ తదితర ప్రముఖులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు. అయితే వీరిలో అందరి దృష్టిని ఆకర్షించింది త్రిష అని చెప్పొచ్చు. ఎందుకంటే గత కొన్ని రోజులుగా విజయ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ రూమర్లకు బలం చేకూరుస్తూ ఇద్దరూ కూడా జంటగా ఓ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. దీంతో వీరు కూడా త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఓటు వేయడానికి వచ్చిన త్రిషపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే త్రిష మాత్రం సింపుల్‌గా తన తల్లితో వచ్చి ఓటు వేసి వెళ్లిపోయింది.



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో ప్రత్యేక ముద్ర వేసుకున్న హీరోయిన్ ఆమె. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఆమె ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. తెలుగులో స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుని తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. అంతేకాదు అప్పట్లో ఆమె కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్. అయితే గత కొన్నేళ్లుగా ఆమె పూర్తిస్థాయిలో బాలీవుడ్ సినిమాలకే పరిమితమయ్యారు. తాజా సమాచారం ప్రకారం, ఆ హీరోయిన్ సుమారు 6 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ దక్షిణాది చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు.

కన్నడ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘మ్యాక్స్’ () ద్వారా ఆమె మళ్లీ సౌత్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో టబు ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్ లో ఆమె ఇప్పటికే పాల్గొన్నట్లు తెలుస్తోంది. కేవలం కన్నడలోనే కాకుండా, ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో టబు పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఇప్పటికే ఆమె విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబోలో వస్తున్న ప్రాజెక్టులో నటిస్తున్న సంగతి తెలిసిందే.కన్నడ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘మ్యాక్స్’ (మీఖఇ) ద్వారా ఆమె మళ్లీ సౌత్ ప్రేక్షకులను పలకరించబోతున్నారు. కిచ్చా సుదీప్ హీరోగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో టబు ఒక కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమా షూటింగ్ లో ఆమె ఇప్పటికే పాల్గొన్నట్లు తెలుస్తోంది. కేవలం కన్నడలోనే కాకుండా, ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో టబు పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఇప్పటికే ఆమె విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబోలో వస్తున్న ప్రాజెక్టులో నటిస్తున్న సంగతి తెలిసిందే.టబు తెలుగులో వెంకటేశ్ సరసన ‘కూలీ నంబర్ 1’, నాగార్జున జోడిగా ‘నిన్నే పెళ్లాడతా’, ‘ఆవిడ మా ఆవిడే’ వంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్ గా వెలిగిపోయారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణతో సైతం ‘అల వైకుంఠపురములో’ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో కనిపించి మెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ఆమె సౌత్ వైపు చూడలేదు. ఇప్పుడు సుదీప్ సినిమాతో కన్నడలోకి కలిగిస్తోంది.టబు తెలుగులో వెంకటేశ్ సరసన ‘కూలీ నంబర్ 1’, నాగార్జున జోడిగా ‘నిన్నే పెళ్లాడతా’, ‘ఆవిడ మా ఆవిడే’ వంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్ గా వెలిగిపోయారు. అలాగే మెగాస్టార్ చిరంజీవి, బాలకృష్ణతో సైతం నటించింది. ఆమె చివరిగా తెలుగులో అల్లు అర్జున్ నటించిన ‘అల వైకుంఠపురములో’ సినిమాలో ఒక ముఖ్య పాత్రలో కనిపించి మెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ఆమె సౌత్ వైపు చూడలేదు.

## చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణతో బ్లాక్ బస్టర్ హిట్స్

## దడపుట్టించే సైకో క్రైమ్ థ్రిల్లర్ ఇది.. చూడటం మొదలు పెడితే కళ్ళు తిప్పరంతే

:




ప్రస్తుతం ఓటీటీలో సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ సినిమాలదే హవా. భాషతో సంబంధం లేకుండా ఈ జానర్ సినిమాలు, సిరీస్ లను చూసేస్తున్నారు ఆడియెన్స్. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగానే ఓటీటీ సంస్థలు కూడా ఇంట్రెస్టింగ్ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలు, వెబ్ సిరీస్ లను ఆయా భాషల్లోకి అనువాదం చేసి మరీ స్ట్రీమింగ్ కు తీసుకొస్తున్నాయి. అలా కొన్ని రోజుల క్రితం ఓటీటీలోకి వచ్చిన ఓ వెబ్ సిరీస్ టాప్ ట్రెండింగ్ లో కొనసాగుతోంది. సాధారణంగా ఇలాంటి క్రైమ్ థ్రిల్లర్ల మూవీస్, వెబ్ సిరీస్ లలో కిల్లర్ లేదా క్రిమినల్ ఎవరన్నది చివరి దాకా రివీల్ చేయరు. కానీ ఈ సిరీస్ లో మాత్రం రెండో ఎపిసోడ్ లోనే సీరియల్ కిల్లర్ ను రివీల్ చేస్తారు. అతను హత్యలు ఎలా చేస్తున్నాడో చూపిస్తారు. అయినా ఈ సిరీస్ ఆసక్తిని కోల్పోదు. ఈ సిరీస్ కథ మొత్తం ఓ సీరియల్ కిల్లర్ కేసు చుట్టూనే తిరుగుతుంది. అతి చిన్న వయస్సులో ముంబై నగరానికి డీసిపి అయిన రీటా ఫెరారియా ఈ కేసును ఒక ఛాలెంజింగ్ గా తీసుకుంటుంది. ఉన్నట్లుండి నగరంలో వరుసగా హత్యలు జరుగుతూ ఉంటాయి. ఆ హత్యలు కూడా ఒకే పంథాలో జరుగుతుంటాయి. ఓ సీరియల్ కిల్లర్ పోలీసులకు ఒక చిన్న క్లూ కూడా వదలకుండా చాలా పకడ్బందీగా ఈ మర్డర్లు చేస్తుంటాడు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 . Jangoan , Telangana State.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State.
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.